భానుడి భగభగ... 38.8 డిగ్రీలు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భానుడి భగ..భగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మార్చి మొదటి వారంలోనే పలు ప్రాంతాల్లో 39 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సరూర్‌నగర్, కార్వాన్‌లో ఆదివారం అత్యధికంగా 38.8 డిగ్రీలు నమోదయ్యాయి. వారం రోజుల క్రితం గ్రేటర్‌లో 3,100 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైతే పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో 3,300 మెగావాట్లకు పెరిగింది. పగటి ఉష్ణోగ్రలతోపాటు రాత్రి ఉష్ణోగ్రత 24 డిగ్రీల వరకు నమోదవుతున్నది. మరో రెండురోజులు ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఉపరితల గాలులు దక్షిణ/నైరుతి దిశలో గంటకు 4-8 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

చార్మినార్	38.4
బేగంపేట	38.7
సంతోష్‌నగర్	38.5
గోషామహల్	38.3
ఉప్పల్	38.3
కాప్రా	38.3
హయత్‌నగర్	38.0
ఎల్‌బీనగర్	37.9
మూసాపేట	37.7
రాజేంద్రనగర్	37.6
కుత్బుల్లాపూర్	37.6

సహజనటి జయసుధకు ఎక్సలెన్స్ అవార్డు


నటి జయసుధకు అవార్డు ప్రదానం చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

హైదరాబాద్ సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ వారు సినిమా, సంగీతం, వైద్య విభాగాల్లో ఇచ్చే ప్రతిష్ఠాత్మక వోకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు (వృత్తిపరమైన సమర్థత పురస్కారం)ను సినీ నటి జయసుధ అందుకున్నారు. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం జయసుధకు అవార్డు ప్రదానం చేశారు. సినిమారంగం నుంచి సహజనటి జయసుధ, నటుడు కాదంబరి కిరణ్‌కుమార్, సంగీతం నుంచి ప్రఖ్యాత ఈలపాట గాయకుడు ఎంవీ రమణారెడ్డికి, బయోకెమిస్ట్రీ నుంచి డా.సాయిపద్మకు ఈ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఈస్టుకు చెందిన అధ్యక్షులు సుదేష్‌రెడ్డి, వోకేషనల్ సర్వీస్ డైరెక్టర్ సీవీ సుబ్బారావు, కార్యదర్శి టీఎంఎస్ చౌదరి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎల్లో రిబ్బన్ రన్


విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న అతిథులు

ఖైరతాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎండో మెట్రియాసిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ జరిగిన ఎల్లో రిబ్బన్ పరుగు చూపరులను ఆలోచింపజేసింది. ఎండో మెట్రియాసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ పీవీ నర్సింహారావు మార్గంలోని జలవిహార్ నుంచి సంజీవయ్యపార్కు వరకు, తిరిగి జలవిహార్ వరకు 3కె, 5కె రన్‌లు జరిగాయి. దీనిని అపోలో ఆస్పత్రి సీఈవో తేజస్విరావు ప్రారంభించగా, ఎన్‌ఎండీసీ డైరెక్టర్ వినయ్‌కుమార్, ఎల్‌ఐసీ అధికారులు జీవీబీ రామయ్య, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ వివీ బింద్రా మాట్లాడుతూ ఇది మహిళల్లో వచ్చే గర్భాశయ సంబంధిత వ్యాధి అని, ప్రపంచవ్యాప్తంగా 24 కోట్ల మంది మహిళలు దీనితో బాధపడుతుండగా దేశంలో 4.2 కోట్ల మంది అవస్థ పడుతున్నారని తెలిపారు. మహిళలు ప్రారంభదశలోనే చికిత్స చేయించుకునేలా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ శ్వేతారెడ్డి, యువత పాల్గొన్నారు.

మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలి: ఆర్.కృష్ణయ్య


ధర్నాలో ఆర్.కృష్ణయ్య, తదితరులు

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరల ప్రకారం రాష్ట్రంలోని ఎనిమిది లక్షల మంది ఎస్సీ ఎస్టీ, బీసీ హాస్టల్ గురుకుల పాఠశాల విద్యార్థులతోపాటు 16లక్షల మంది కళాశాలల విద్యార్థుల మెస్‌చార్జీలను పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లను పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం నేత జిల్లపల్లి అంజి, గుజ్జ సత్యం ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సొంత భవనాల్లో 300 హాస్టళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంఘం నాయకులు రాజేందర్, అనంతయ్య, కృష్ణయాదవ్, నరసింహగౌడ్, రఘుపతి, వంశీ, మణికంఠ విద్యార్థులు పాల్గొన్నారు.

గృహజ్యోతి బిల్లుల జారీలో సమస్యలు..!

- వివరాలన్నీ సరిగా ఉన్నవారికే జీరో బిల్లులు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి జీరోబిల్లుల జారీలో సమస్యలు తలెత్తుతున్నాయి. మార్చి 1న ఉదయం 6గంటలకే గృహజ్యోతి జీరోబిల్లుల జారీని విద్యుత్‌శాఖ ప్రారంభించినా రోజుకు ఎంతమందికి జీరో బిల్లులు జారీచేస్తున్నారనే వివరాలు మాత్రం వెల్లడించలేకపోతున్నారు. హైదరాబాద్ సౌత్‌సర్కిల్‌లోని పలుప్రాంతాల్లో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల్లో వివరాలు సరిగా లేకపోవడంతో పలువురికి సాధారణ విద్యుత్‌బిల్లులు ఇస్తున్నారు. దరఖాస్తులో అన్ని వివరాలు సరిగా నమోదుచేసి ఉండి, విద్యుత్‌శాఖ స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో వివరాల పరిశీలన పూర్తయిన గృహజ్యోతి లబ్ధిదారులకు మాత్రం జీరో బిల్లులు జారీచేస్తున్నారు. అయితే గృహజ్యోతి అర్హత కలిగి వివరాలు తప్పుగా నమోదైతే జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని వివరాలు సరిచేయించుకుంటే వారికి కూడా జీరో బిల్లులు జారీచేస్తామని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

హైకోర్టు ఉద్యోగుల క్రికెట్ మ్యాచ్ రన్నర్ టీఎస్ జట్టు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ హైకోర్టు ఉద్యోగుల మధ్య మంగళగిరి అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఏపీ జట్టు 18 పరుగులతో విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఏపీ జట్టు 20 ఓవర్లలో 126 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ జట్టు 108పరుగులకు ఆలౌటైంది. అంతకు ముందు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. మ్యాచ్‌లో విజయం సాధించిన ఏపీ జట్టుకు ఏపీ హైకోర్టు ప్రోటోకాల్ రిజిస్ట్రార్ ఏవీ రాఘవస్వామి ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన తెలంగాణ జట్టుకు ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్ కప్ అందించారు.

నేడు టీఎస్ఆర్టీసీ లక్కీడ్రా

చాదర్‌ఘాట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గతేడాది దసరా సందర్భంగా అక్టోబర్ 18 నుంచి 30వ తేదీ వరకు టీఎస్ఆర్టీసీ లక్కీ డ్రా బాక్స్‌లను బస్సుల్లో ఏర్పాటు చేసింది. సోమవారం ఎంజీబీఎస్‌లో డ్రా తీయనున్నట్లు రంగారెడ్డి రీజియన్ ఇన్‌చార్జి ఆర్ఎం బి.రాజు తెలిపారు. ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ చేతుల మీదుగా రీజియన్ పరిధిలో 10 లక్కీ డ్రాలు తీయనున్నారని ఆయన తెలిపారు. ఇందులో ఐదుగురు మహిళలు, మరో ఐదుగురు పురుషులను ఎంపిక చేయనున్నారు. ఒక్కో విజేతకు రూ.9,900 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిమ్స్ వైద్యుల పరిశోధన పత్రానికి మొదటి బహుమతి


ప్రజ్వల్, ఉమామహేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన తెలంగాణ న్యూరో సైన్సెస్ 8వ వార్షిక సదస్సులో నిమ్స్ వైద్యులు ప్రజ్వల్, ఉమామహేశ్వరరావు సమర్పించిన పరిశోధన పత్రానికి మొదటి బహుమతి దక్కింది. తలకు గాయాలపాలైన రోగులపై ప్రొఫెసర్ డాక్టర్ ఎం.విజయ్ సారధి మార్గదర్శకత్వంలో వీరు పనిచేస్తున్నారు.


దుండిగల్ మున్సిపల్ పరిధిలో పోలియో చుక్కలు వేస్తున్న కమిషనర్ సత్యనారాయణ


కూకట్‌పల్లి వెంకటేశ్వరనగర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


బాపూనగర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్


కూకట్‌పల్లిలోని ఆరోగ్య కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

పల్స్ పోలియో విజయవంతం

(శేరిలింగంపల్లి/ కూకట్‌పల్లి/ కుత్బుల్లాపూర్, జోన్‌బృందం)

పోలియో ఆదివారం వచ్చేసింది. చిన్నారులు పోలియో బారిన పడకుండా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం విజయవంతం అయింది. అప్పుడే పుట్టిన పాప నుంచి ఐదేళ్లలోపు చిన్నారుల తల్లిదండ్రులు బాధ్యతతో తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి చిన్నారులకు చుక్కలు వేశారు. నిండు జీవితానికి రెండు చుక్కలు అంటూ ప్రచారం చేసిన వైద్య సిబ్బంది ప్రతీ కాలనీ, బస్తీ, గల్లీల్లో ఎక్కడ చూసినా పోలియో చుక్కల కేంద్రాలే దర్శనమిచ్చాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కూకట్‌పల్లి, మూసాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ వి.మమత, ఇతర ప్రాంతాల్లో కార్పొరేటర్లు, నాయకులు, వైద్యులు, సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వివిధ ప్రాంతాల్లోని పోలియో కేంద్రాలకు చిన్నారుల తల్లిదండ్రుల అధిక సంఖ్యలో రావడంతో ఆ ప్రాంతాలు సందడిగా మారాయి.


నిజాంపేట్‌లో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి


షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీలో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ


జీడిమెట్ల సుభాష్‌నగర్ డివిజన్‌లోని ప్రభుత్వ స్కూల్‌లో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ హేమలతాసురేష్‌రెడ్డి


జీడిమెట్లలోని జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్‌లో పోలియోచుక్కలు వేస్తున్న కార్పొరేటర్ కె.జగన్


మియాపూర్ డివిజన్ ఎంఏనగర్‌లోని పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్, ఉప్పలపాటి శ్రీకాంత్


శేరిలింగంపల్లి నల్లగండ్లలో పోలియో చుక్కలు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్


బాలానగర్ పీహెచ్‌సీలో కార్పొరేటర్ రవీందర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డా. మమత


ఫతేనగర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్, ఆశా వర్కర్లు, బీఆర్ఎస్ నేతలు


బాలానగర్ బాబారాందేవ్‌రావు ఆసుపత్రిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సినీ నిర్మాత గొట్టిముక్కల పద్మారావు


పర్వత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం


హైదర్‌నగర్ జడ్‌పీహెచ్ పాఠశాలలో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు


హైదర్‌నగర్ ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్


భెల్‌కాలనీ డివిజన్ పరిధిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

'ఈటల'ను కలిసిన నాయకులు


ఈటల రాజేందర్‌ను కలిసిన ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, బీజేపీ నేతలు పద్మయ్య

బాలానగర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను కూకట్‌పల్లి జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జనసేన నాయకులతో కలిసి శామీర్‌పేటలోని ఈటల నివాసిని వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మండలి దయాకర్, కొల్లా శంకర్, బీజేపీ సీనియర్ నాయకులు పద్మయ్య, వినోద్ శ్రావణ్, హేమ సుందర్, హరిబాబు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి


కార్యక్రమంలో బ్రాహ్మణ మహిళా సంఘం ప్రతినిధులు

హైదర్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కామాక్షి బ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సంఘం కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో వైష్ణవి క్యాటరర్స్ అధినేత వైష్ణవిప్రసాద్, ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్ గురజాడ విద్య, వైద్యులు వంగల సీతాలక్ష్మి, డాక్టర్ మాధురి, ఆధ్యాత్మికవేత సన్నిధానం లక్ష్మీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా రాజకీయంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఎన్నో రంగాలలో మహిళలు తమశక్తి సామర్థ్యాలు చాటుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారని తెలిపారు. ఆయా రంగాల్లో ప్రతిభ చాటుతున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త యమునా పాఠక్, ఆశాజ్యోతి, అధ్యక్షురాలు మల్యాల రమణి, పారిశ్రామికవేత్త రాధాకృష్ణమూర్తి, సంఘం ప్రతినిధులు శంకర్, నర్సింహారావు, సుధాకర్, కరుణాకర్, భువనేశ్వరి, కల్యాణి, రమణ, పీఆర్‌కె మూర్తి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, పద్మ, రమాదేవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా రవీందర్‌రెడ్డి



బాలానగర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించిన మాజీమంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలుగు సాహితీ సదస్సుకు రచయిత్రి అనురాధకు ఆహ్వానం


అనురాధ

అల్లాపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవాల సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో మార్చి 9, 10 తేదీలలో దంటు కళాక్షేత్రం, కాకినాడలో జరగనున్న 'అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు'కు ప్రముఖ రచయిత్రి యలమర్తి అనురాధకు ఆహ్వానం అందింది. రెండు రోజుల పాటు, సుమారు 16 గంటలలో 8 ప్రసంగ వేదికలలో తెలుగుభాషా, సాహిత్యాల సుదీర్ఘ సహజ సౌరభాలను తమ ప్రసంగాల ద్వారా వినిపించే అపూర్వ అవకాశం 100 మంది దేశ, విదేశ వక్తలకు దక్కిందన్నారు. 50 ఏళ్ల తన సాహితీ సేద్యానికి ఇలాంటి ప్రతిష్ఠాత్మక సభలో పాల్గొనే అవకాశం రావటం అదృష్టంగా అనురాధ పేర్కొన్నారు. 'జీవితం ఏమిటి?' అనే నవలను పుస్తక పరిచయంగా పత్ర సమర్పణ చేయనున్నట్లు యలమర్తి అనురాధ తెలిపారు.

దిల్‌ఖుష్‌నగర్ అధ్యక్షుడిగా మహ్మద్ ముజీబ్


ముజీబ్ ఖాదర్

బాలానగర్: డివిజన్ పరిధిలోని దిల్‌ఖుష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్షుడిగా మహ్మద్ అబ్దుల్ ముజీబ్ (259 ఓట్లు), జనరల్ సెక్రటరీగా మహ్మద్ ఖాదర్ (254 ఓట్లు) ఎన్నికయ్యారు. మొత్తం 600 మంది ఓటర్లుగా ఉన్న ఈ బస్తీలో 467 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీటిలో అందులో 7 ఓట్లు చెల్లలేదు. ఫలితాలు వెలువడిన అనంతరం విజేతలకు అనుచరులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 19 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా విడుదలైన రూ.12 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సప్తగిరికాలనీలోని తన నివాసంలో ఆదివారం అందజేశారు. అత్యవసర ఆరోగ్య సేవలకు ఆర్థిక సాయం పొందేందుకు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, దొడ్ల రామకృష్ణగౌడ్, కాశీనాద్‌యాదవ్, చంద్రమోహన్‌సాగర్, శ్రావణి రెడ్డి, అరవింద్, చిన్న, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

దుండిగల్‌లో రెవెన్యూ మేళా

దుండిగల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ మేళాను అధికారులు ఆదివారం నిర్వహించారు. ఈ మేళాలో ఆస్తి పన్నుకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ మేళాను మంగళ, గురు, ఆదివారాల్లో నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.

కేంబ్రిడ్జి స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్‌లోని కేంబ్రిడ్జి స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించి విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకించి అభినందించారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి కానుకుంటలోని మైత్రిహైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనకు కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, డైరెక్టర్ ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా సైంటిస్ట్ రఘునందన్‌కుమార్, శ్రీనివాసరావు హాజరై ప్రారంభించారు. కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రత్నకుమారి, లింగంపల్లి గ్రామ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు రవియాదవ్, గోపినగర్ బస్తీ అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, తుకారం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్

హైదర్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తోందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆల్విన్‌కాలనీ జయశంకర్‌నగర్, మహంకాళినగర్, శంశిగూడ, రాయపాటి రమణ, కేటీఆర్ కాలనీల నుంచి బీఆర్ఎస్, బీజేపీ నుంచి కార్యకర్తలు, నాయకులు పట్వారీ శశిధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.


మొయినుద్దీన్‌కు నియామకపత్రం అందజేస్తున్న బండి రమేష్

కాంగ్రెస్ అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా మొయినుద్దీన్

అల్లాపూర్/ఫతేనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మొయినుద్దీన్‌ను నియమిస్తూ ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్ ఆదివారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహారావు, తూము సంతోష్, సుంకన్న, పులి శివకుమార్‌గౌడ్, లక్ష్మయ్య, కనకయ్య పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

గచ్చిబౌలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ పరిధిలోని జాగృతి కాలనీలో కాలనీ అసోసియేషన్, కాలనీవాసులు రూ.30 లక్షల అంచన వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను కార్పొరేటర్లు హమీద్‌పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆదివారం ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శ్రీనివాస్, కాలనీ వాసులు రామకృష్ణ, వాసు, చంద్రశేఖర్, రతన్, శ్రీనివాస్, అమర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

కైసర్‌నగర్‌లో కార్డన్ సెర్చ్

గాజులరామారం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ సీపీ, మేడ్చల్ డీసీపీ ఆదేశాల మేరకు మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్‌లోని కైసర్‌నగర్‌లో మేడ్చల్, దుండిగల్, సూరారం పోలీసులు సుమారు 66 మంది శనివారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని ఆరు ద్విచక్రవాహనాలు, అనుమతులు లేకుండా నిల్వ చేసిన 25 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు సరైన పత్రాలు ఉంటే పోలీసులకు చూపించి వాహనాలను తీసుకెళ్లవచ్చొన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కాలనీల్లో తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

నారీశక్తి వందన్ 3కే రన్


రన్‌లో పాల్గొన్న రవికుమార్‌యాదవ్, మహిళలు

గచ్చిబౌలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, వారికి ప్రాధాన్యం ఇస్తూ సమన్యాయం కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియం వద్ద బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నారీశక్తి వందన 3కె రన్‌లో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి గీత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్పందనతో కలిసి రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెండా ఊపి 3 కే రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో మహిళలు అన్ని రంగాల్లో పోటీపడి రాణించాలన్నారు. ప్రతి మహిళా ఒక శక్తి అని వారికి అన్నిచోట్లా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పురుషులతో పాటు సమాన హక్కులు కల్పించి సమన్యాయం చేయాలన్నారు. కేంద్రప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం ప్రతి మహిళకు దక్కిన గౌరవం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వరలక్ష్మి, విద్యాపాండే, మాధవీలత, శివాసింగ్, గోపాల్‌తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.